బాబు మానస పుత్రిక.. రేవంత్ ప్రాజెక్టు

చంద్రబాబు హయాంలోనే తెరపైకి మూసీ సుందరీకరణ పనులు
'నందనవనం' పేరిట పేదల తరలింపు.. అప్పట్లో గాయిగాయి చేసిన కాంగ్రెస్
కేసీఆర్ హయంలో మూసీ ప్రక్షాళన.. పేదల జోలికి వెళ్లకుండా ప్రణాళిక
కానీ ఇప్పుడు ఇండ్లు కూల్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ సర్కార్
బాబు దోస్త్ ఈశ్వరన్ కంపెనీకే మూసీ మాస్టర్ ప్లాన్ బాధ్యతలు
166.48 కోట్లతో మెయిన్ హార్ట్‌కు అప్పగిస్తూ రేవంత్ సర్కారు ఉత్తర్వులు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): కాలాలు మారినా పేదల తలరాతలు మారలేదనడానికి 'మూసీ' కంటే మంచి ఉదాహరణ ఉండదేమో. 1999-2001 చంద్రబాబు పాలనా కాలంలో మూసీ పేదల మెడపై వేలాడిన కత్తి.. మళ్లీ ఇప్పుడు ఆయన సహచరుడు రేవంత్ హయాంలో భయపెడుతున్నది. నాడు, నేడు సేమ్ టు సేమ్. అడ్డగోలుగా పేదల తరలింపే లక్ష్యం. నాడు ప్రతిపక్షాలు విజయవంతంగా అడ్డుకోవడంతో ఆగిన కత్తిని దశాబ్దాల తర్వాత మళ్లీ రేవంత్ ఝుళిపిస్తున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు రేవంత్ చెప్తున్నట్టు ఆయన మానస పుత్రిక కాదని, చంద్రబాబు హయాంలో అర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టును ఇప్పుడు రేవంత్ తలకెత్తుకున్నారని పలువురు హక్కుల కార్యకర్తలు గుర్తు చేసుకుంటున్నారు. అంతేకాదు! లక్షన్నర కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో ఏంచేయాలి? ఎట్లచేయాలి? ఎక్కడెంత ఖర్చు పెట్టాలి? అన్నింటికీ ఒక రూట్‌మ్యాప్‌ను రూపొందించే 'గురు'తర బాధ్యతను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మెయిన్ హార్ట్ అనే ఒక కన్సల్టెన్సీ కంపెనీ చేతుల్లో పెట్టింది. ఇంతకీ ఈ కంపెనీ ఎవరిదో తెలుసా? ఏపీ సీం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, అమరావతి గ్రా ఫిక్స్ సూత్రధారి, ప్రస్తుతం జైల్లో ఉన్న సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్‌కు చెందినది. 166.48 కోట్లతో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మాస్టర్‌ప్లాన్ బాధ్యతలను మెయిన్‌హార్ట్ కన్సార్టియంకు అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం ఈ నెల 4న ఉత్తర్వులు జారీచేసింది. పబ్లిక్ డొమైన్‌లో మాత్రం ఈ ఉత్తర్వులను (జీవో ఆర్టీ నెం.472, 4.10.2024) అందుబాటులో ఉంచలేదు.

'బాబు' హయాంలో 'నందనవనం'

మూసీ సుందరీకరణ ప్రాజెక్టును వాస్తవంగా కేసీఆర్ హయాంలోనే రూపొందించారు. అప్పుడు తయారుచేసిన ప్రతిపాదనల ప్రకారమే మేం ప్రాజెక్టును ముందుకు తీసుకుపోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు కొన్ని రోజుల కిందట ప్రకటించారు. అంటే కేసీఆర్ ప్రభుత్వమే ఈ సుందరీకరణ ప్రాజెక్టును తెరపైకి తెచ్చిందనే అభిప్రాయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల్లోకి వదిలింది. కానీ చరిత్ర తిరగేస్తే, అసలు మూసీ సుందరీకరణ అనే దానిని తెరపైకి తెచ్చింది సాక్షాత్తూ చంద్రబాబునాయుడు. ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి. నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 1999-2001 సమయంలో ఈ ప్రాజెక్టు అమలులో ఉన్నట్టుగా సీనియర్ అధికారులు తెలిపారు. 'నందనవనం' పేరిట మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ నుంచి నాగోల్ వరకు 14 కిలోమీటర్ల మేర మూసీ సుందరీకరణ చేపట్టాలనేది ప్రతిపాదన. ఇందులో భాగంగా శంకర్‌నగర్, మూసానగర్, కమల్‌నగర్ తదితర మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని అక్కడి నుంచి తరలించాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వారందరికీ ఒకచోట ప్రభుత్వపరంగా వసతి కల్పించేందుకే కర్మన్‌ఘాట్ సమీపంలో 'నందనవనం' అనే భారీ గృహ సముదాయాన్ని నిర్మించింది. ఈ మేరకు చాలా మంది నిరుపేదలను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. చాలామంది వ్యతిరేకించి తాము ఖాళీ చేసేదిలేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. సుందరీకరణలో భాగంగా కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)తో కోట్లాది రూపాయల పనులు చేపట్టారు. కానీ ఇందులో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకోవడంతో అప్పుడు ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. అప్పటి హైదరాబాద్ కలెక్టర్ కూడా అవినీతి వాస్తవమేనని తేల్చడంతో కుడాకు పనుల అప్పగింతను నిలిపివేస్తున్నట్టు అప్పటి పురపాలకశాఖ మంత్రి ఎంఎన్‌డీ ఫరూఖ్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. మూసీలో వేల క్యూసెక్కుల వరద వస్తుందనే రికార్డులు ఉండగా... కేవలం పది మీటర్ల సెంట్రల్ ఛానెల్‌ను నిర్మించి అందులోకి వరదను మళ్లిస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపాదించడంపై తాము ఆయన ముందే నవ్వి మౌనంగా వచ్చామని సామాజిక కార్యకర్త ఒకరు తెలిపారు. అందుకు ఆ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు హౌస్ కమిటీకి కూడా డిమాండు చేశాయి. కాంగ్రెస్ తరపున ప్రస్తుత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీజేపీ తరపున అప్పటి బీజేఎల్పీ నేత, ప్రస్తుత త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి మూసీ సుందరీకరణ పనుల్లో అవినీతి, ఇతరత్రా అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాలక్రమేణా సుందరీకరణ ప్రాజెక్టు తెరమరుగైంది.

మూసీ వయా అమరావతి!

మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు మాస్టర్ ప్లాన్ రూపొందించే బాధ్యతను మూడు కన్సల్టెన్సీల కన్సార్షియంకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 4వ తేదీన పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దానకిశోర్ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ప్రతిపాదన మేరకు మెయిన్‌హార్ట్ సింగపూర్ ప్రైవేటు లిమిటెడ్‌తో పాటు కుష్మన్ వేక్ ఫీల్డ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ఆర్‌ఐవోఎస్ డిజైన్ స్టూడియోస్ ప్రైవేటు లిమిటెడ్ అనే మూడు కన్సల్టెన్సీ కంపెనీల కన్సార్టియంకు బాధ్యత అప్పగించేందుకు పాలనా అనుమతినిస్తూ కన్సార్టియంతో ఒప్పందానికి కూడా ఆమోదం తెలిపింది. ఇందుకుగాను కన్సార్టియంకు రూ.166.48 కోట్లు (రూ.25.40 కోట్ల జీఎస్టీతో కలుపుకొని) చెల్లించనున్నట్టు అందులో పేర్కొన్నారు. ప్రధానమైన మెయిన్‌హార్ట్ కంపెనీలో కీలకమైన భాగస్వామి సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్. తమిళనాడుకు చెందిన ఈయన అమరావతి రాజధాని గ్రాఫిక్ డిజైన్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. అంటే ఏపీ సీఎం చంద్రబాబుకు ఈశ్వరన్ అత్యంత సన్నిహితుడనేది బహిరంగ రహస్యం. అమరావతి నగరాభివృద్ధి బాధ్యతను అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జి (మెయిన్‌హార్ట్ అనుబంధ సంస్థ)కు అప్పగించింది. ఈ సంస్థలో ప్రధాన పెట్టుబడిదారు, డైరెక్టర్ ఈశ్వరన్. ఈయనకు మెయిన్‌హార్ట్‌లో కూడా ప్రధాన వాటాలున్నాయి.

వైఎస్ హయాంలో సేవ్ మూసీ

ఉమ్మడి ఏపీలో 2004 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ 'సేవ్ మూసీ' పేరిట 2005లో ప్రాజెక్టును చేపట్టింది. ఇదే విషయాన్ని ఇటీవల కేవీపీ కూడా సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో ప్రస్తావించారు. 908 కోట్లతో పథకాన్ని ప్రారంభించినప్పటికీ అప్పుడు ప్రభుత్వానికి ఉన్న ప్రాధాన్య అంశాల దృష్ట్యా దీనిపై పెద్దగా దృష్టిసారించలేదని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ వల్ల నష్టపోయే ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి సంతృప్తికరంగా నష్టపరిహారం చెల్లించాలంటే భారీ మొత్తం నిధులు అవసరమవుతున్నందున కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోయిందని పేర్కొన్నారు. ముఖ్యంగా తొలుత మూసీ నది ప్రక్షాళన, ఆపై సుందీకరణ ప్రాజెక్టును రెండో దశలో చేపట్టాలని కూడా కేవీపీ సూచించారు. గతంలోని వైఎస్ సర్కారు కూడా ప్రక్షాళనపైనే నిధులు వెచ్చించింది. అంబర్‌పేట, నాగోల్, అత్తాపూర్ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మించింది.

అప్పుడు బాబు.. ఇప్పుడు ఆర్‌బీ-ఎక్స్

మూసీ సుందరీకరణ పేరు 1999లో తెరపైకి రాగా అప్పట్లో మూసీ పరీవాహక ప్రాంత ప్రజల కంటి మీద కునుకు లేకుండా పోయిందని నగరానికి చెందిన పలువురు హక్కుల నేతలు గుర్తు చేసుకున్నారు.

కేసీఆర్ హయాంలో విజయవంతంగా ప్రక్షాళన

తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్)ను ఏర్పాటు చేసింది. వాస్తవానికి ఒక రోజు, ఒక ఏడాదిలో మూసీ మురుగుగా మారలేదు. ఆరు దశాబ్దాల కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే మూసీ మురికికూపంలా మారింది. రాత్రికి రాత్రి మూసీ సుందరీకరణ పూర్తవదనే కేసీఆర్ ప్రభుత్వం అంచెలంచెలుగా ప్రణాళిక రూపొందించింది. భారీ ఎత్తున మురుగునీటి శుద్ధి కేంద్రాలను చేపట్టిం ది. తెలంగాణ ఏర్పడే నాటికి నగరంలో రోజుకు 1950 మిలియన్ లీటర్ల మురుగు ఉత్పత్తి అవుతుంటే అందులో కేవలం 772 మిలియన్ లీటర్లు మాత్రమే శుద్ధి అవుతుంది. మిగిలిన 1178 మిలియన్ లీటర్లు రోజూ మూసీలో కలుస్తుంది. అందుకే కేసీఆర్ ప్రభుత్వం 3866 కోట్లతో 31 శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మాణం చేపట్టింది. గత డిసెంబరు వరకు పనులు శరవేగంగా జరిగాయి. అందులో 6 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. గత 10 నెలలుగా రేవంత్‌ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే వంద శాతం మురుగు శుద్ధి జరుగుతుంది. రేవంత్ ప్రభుత్వం ఇలాంటి కీలక అంశాలపై దృష్టిసారించకుండా రాత్రికి రాత్రి బుల్డోజర్లతో నిరుపేదల ఇండ్ల కూల్చివేతలను భుజాన వేసుకుంది.

మూసీ లెక్కలకే ఢిల్లీకి!

పాలన గాలికొదిలి సీటు కోసం ఢిల్లీ టూర్లు

- ఢిల్లీ పర్యటనలతో రాష్ట్రానికి తెచ్చిందెంత?
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దు
- ఫోర్ బ్రదర్స్ కోసమే ఫోర్త్‌సిటీ
- హైడ్రా హైరానాతో రియల్ ఎస్టేట్ కుదేలు
- తెలంగాణను ఏంజేద్దామనుకుంటున్నవ్?
- సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మూసీ ప్రాజెక్టు మూటల లెక్కలు చెప్పేందుకే ముఖ్యమంత్రి హస్తిన పర్యటనలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పేదల గూడు చెదరగొట్టేందుకు ఢిల్లీలోని తన బాస్‌లతో మంతనాలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలతో ప్రజలకు ఏం ప్రయోజనం ఒనగూరిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం పది నెలల్లోనే 24 సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం, రాష్ట్ర ప్రజలకు ఏ మేరకు లబ్ధిచేకూర్చారో? చెప్పాలని నిలదీశారు. రేవంత్‌రెడ్డి అత్యధికసార్లు ఢిల్లీ పర్యటన చేసిన ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడని ఎద్దేవాచేశారు.

గులాంగిరీ తప్పదని ముందే చెప్పినం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఢిల్లీకి గులాంగిరీ తప్పదని తాము ఎన్నికలకు ముందే చెప్పామని, ఇప్పుడు అదే జరుగుతున్నదని కేటీఆర్ గుర్తుచేశారు. ఢిల్లీ బాసులకు ఎప్పుడు గుర్తొస్తే అప్పుడు ముఖ్యమంత్రి జీ హుజూర్ అంటూ హస్తినకు వెళ్తున్నారని విమర్శించారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల ముందు తాకట్టు పెట్టడమేనంటూ నిప్పులు చెరిగారు. మొదట్లో సీఎం ఢిల్లీ పర్యటనలపై విమర్శలు రావటంతో ఇప్పుడు తెలివిగా కేంద్ర పెద్దలను కలిసి రాష్ట్రానికి నిధులు తెచ్చేందుకని నమ్మబలుకుతున్నారని మండిపడ్డారు. ఎంత మంది కేంద్రం పెద్దలను కలిసి రాష్ట్రానికి ఎన్నివేల కోట్లు తెచ్చారో చెప్పాలని, రేవంత్ బడే భాయ్ మోదీని ఒప్పించి ఎన్ని వేల కోట్లు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

మూసీలో కొల్లగొట్టే వేలకోట్ల రూపాయల లెక్క చెప్పేందుకే సీఎం ఢిల్లీ వెళ్లారు. పేదల గూడు కూల్చేందుకు రాహుల్ గాంధీ, అధిష్ఠానంతో రేవంత్ చర్చలు జరుపుతున్నారు.. ప్రజలకు మంచి చేయటం కన్నా ఢిల్లీ బాసులకు జై కొడితే తన సీటుకు ఎలాంటి ఢోకా ఉండదనే చక్కర్లు కొడుతున్నారు. - కేటీఆర్

ఫోర్ బ్రదర్స్ కోసమే ఫోకస్

రేవంత్‌రెడ్డి తన ఫోర్ బ్రదర్స్ కోసమే ఫోర్త్‌సిటీపై ఫోకస్ చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ బూమ్ తగ్గిపోవటానికి ఫోర్త్‌సిటీ పేరుతో కృత్రిమ బూమ్‌ను సృష్టించడమే కారణమని ఆయన ఎక్స్‌వేదికగా ధ్వజమెత్తారు. హైడ్రా హైరానాతో రెండు నెలల్లోనే హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందని, తద్వారా రిజిస్ట్రేషన్లు పడిపోయిన వైనాన్ని ఆయన ఏకరువు పెట్టారు. ఫోర్ బ్రదర్స్ సిటీపైనే ఫోకస్ చేసి, కృతిమ రియల్ బూమ్ కోసం ఆలోచిస్తున్నాడని, సామాన్యుల కొనుగోళ్లు, అమ్మకం లేనిది బూమ్ ఎట్లా వస్తది? ఆదాయం ఎట్లా పెరుగుతది? అని ప్రశ్నించారు. 'ప్రతి పథకానికి డబ్బుల్లేవని తెల్లారి లేస్తే అరిచే రేవంత్‌రెడ్డి తీరు మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె అన్నట్టు ఉన్నది' అని విమర్శించారు.

సీఎం సీటుకు ఢోకా రావద్దనే..

ప్రజల అవసరాలను పక్కనబెట్టి చీటికి మాటికి సీఎం ఢిల్లీకి వెళ్తుండటం చూస్తుంటే ప్రజలకు మంచి చేయటం కన్నా ఢిల్లీ బాసులకు జై కొడితే తన సీటుకు ఢోకా ఉండదని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. పది నెలల పాలనలో తెలంగాణలో ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని చెప్పారు. ఢిల్లీ హైకమాండ్ కూడా రేవంత్‌రెడ్డి పాలనపై సంతోషంగా లేనందునే పదేపదే పిలుస్తూ ఆయనకు చీవాట్లు పెడుతున్నట్టు ఉందని ఎద్దేవాచేశారు. పది నెలల్లోనే ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్తే ఏడ్లేళ్లలో మరో 125 సార్లు వెళ్తాడు కావచ్చని అనుమానం వ్యక్తంచేశారు. ప్రజలు అధికారమిచ్చింది ఢిల్లీకి గులాంగిరీ చేసేందుకు కాదని ప్రజలకు మంచి చేసేందుకనే విషయాన్ని సీఎం గుర్తించాలని హితవుపలికారు.

జనం కండ్లు 'మూసీ'..

మొదటిపేజీ తరువాయి...

చంద్రబాబు ఇప్పుడు రేవంత్ పేదల్ని బలవంతంగా తరలించడం షరా మామూలే! అప్పుడూ అవినీతి ఆరోపణలు గుప్పుమనడమే కాదు ; ఏకంగా రుజువయ్యాయి. ఇప్పుడూ మూసీ భారీ స్కామ్ ముక్కుపుటాలు అదిరేలా కంపు కొడుతున్నది. ఈ పోలికలన్నీ ఇట్లా ఉంటే తాజాగా మరో అద్భుతమైన పోలిక వెలుగులోకి వచ్చింది. అదేమిటంటే ఐదేండ్ల కింద అమరావతి ప్రాజెక్టును చేపట్టి, గ్రాఫిక్‌లతో రంగుల కలలు చూపించి, సగంలో వదిలేసిపోయిన సింగపూర్‌కు చెందిన 'మెయిన్ హార్ట్' కంపెనీయే ఇప్పుడు మూసీ కథకు అసలు కన్సల్టెంట్. ఈ మేరకు శుక్రవారమే రహస్యంగా జీవో కూడా జారీఅయ్యింది. పార్టీలేవైతేనేం? మనుషులు ఎక్కడుంటేనేం? మనసులు కలిస్తే సరిపోదా! 'బంధాల'వే కుదురుకుంటాయి. మూసీ ప్రాజెక్టు 25 ఏండ్ల తర్వాత కూడా బాబుగారు చూపిన బాట లోనే తెరమీదకు రావడం, ఐదేండ్ల క్రితం ఆయనతో సన్నిహిత సంబంధాలు నెరపిన మెయిన్ హార్ట్ కంపెనీకే ప్రాజెక్టు కన్సల్టెన్సీ బాధ్యత కూడా దక్కడం కాకతాళీయం కాదు కదా?

ఈ కుంట ఎవరి 'హస్త'గతం!



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం గ్రామంలో వడ్డర్‌వాణి కుంట ఉన్నదని ప్రస్తుతం ఈ కుంట పూర్తిగా కబ్జాకు గురైందని భట్టి చూపిన మ్యాప్ ఇది. అయితే 2014 మ్యాప్‌లో కుంటలో ఎక్కడా చుక్క నీరు కనిపించలేదు. అంటే 2014కు ముందే కుంట కబ్జాకు గురైనట్టేనని, అప్పుడు కాంగ్రెస్ పాలనే ఉండేనని నెటిజన్లు అనుకుంటున్నరు.

లేనిది ఉన్నట్టు.. భట్టి కనికట్టు!

- నీళ్లు లేని చోట చెరువులున్నట్టు ప్రజెంటేషన్
- 2014 తర్వాత 20, 1956-2014 మధ్య 225 చెరువులు కబ్జా అయినట్టు వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : 'ఆల్ జీబ్రా.. అబ్రక దబ్రా' అన్నట్టు ఉన్నది సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇచ్చిన చెరువుల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్! లేని చెరువులను ఉన్నట్టు చూపి.. అవీ కాంగ్రెస్ హయాంలోనే కబ్జాకు గురైనట్టు పరోక్షంగా చూపి అభాసుపాలయ్యారు. బీఆర్‌ఎస్ హయాంలోనే చెరువులు ఎక్కువ కబ్జా అయ్యాయనే నెపం వేసే క్రమంలో 2014 కంటే ముందు, ఎక్కువ సార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతల కబ్జాలనే తాను విడుదల చేసిన రిపోర్టు ద్వారా బహిర్గతం చేశారు. దీంతో సోషల్ మీడియాలో 'కబ్జాల కాంగ్రెస్' అంటూ పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువుల కబ్జా గురించి భట్టి మాట్లాడుతూ 2014 తర్వాత 20 చెరువులు ఆక్రమణకు గురయ్యాయని, 1956 నుంచి 2014 వరకూ హైదరాబాద్‌లో 225 చెరువులు ఆక్రమణకు గురయ్యాయని చెప్పారు. 1956 నుంచి 2014 వరకు ఎక్కువ కాలం అధికారంలో ఉన్నది కాంగ్రెస్సే కదా? అని విశ్లేషకులు నొక్కిచెప్తున్నారు.

కాంగ్రెస్, టీడీపీ హయాంలోనే..

భట్టి విడుదల చేసిన రిపోర్ట్ చూస్తుంటే కాంగ్రెస్, టీడీపీ హయాంలోనే ఎక్కువశాతం చెరువులు కబ్జా అయినట్టు స్పష్టమవుతున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఆ రెండు పార్టీల పాలనలోనే సుమారు 10 రెట్ల ఆక్రమణలు జరిగినట్టు భట్టి రిపోర్టు ద్వారా తెలుస్తున్నదని అంటున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఆక్రమణకు గురైనట్టు చెప్తున్న చిత్రాల్లో కొన్నింట్లో చెరువుల ఉనికే లేదని అంటున్నారు. చిన్న నీటి కుంటలను కూడా పెద్ద సరస్సులుగా చూపినట్టు స్పష్టంగా అర్థమవుతున్నదని అంటున్నారు. మొత్తానికి కాంగ్రెస్ సెల్ఫ్‌డబ్బా కొట్టుకోవడంలోనే నిమగ్నమైందని, లేని చెరువులను చూపి అవి కబ్జా అయ్యాయని చెప్పే ప్రయత్నం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవాచేస్తున్నారు.

భట్టి 'సినిమా' అట్టర్ ఫ్లాప్!

- హైడ్రా, మూసీపై మంత్రి భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- లండన్, జపాన్ నదుల వీడియోల ప్రదర్శన
- విలేకరుల ప్రశ్నలకు ఎదురు ప్రశ్నే సమాధానం

హైదరాబాద్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ): హైడ్రా, మూసీ నది వివాదంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం సచివాలయంలో సినిమా స్టైల్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో భాగంగా నగరంలో ఎన్ని చెరువులు ఆక్రమణకు గురయ్యాయి, లండన్, జపాన్ నగరాల్లోని నదులు ఏ విధంగా ఉన్నాయో చూపించారు. అయితే, ఈ సినిమా అట్టర్ ఫ్లాప్ అయిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన ఈ సమావేశం ఎందుకు పెట్టారు. సినిమా ఎందుకు ప్రదర్శించారు. జనాలకు ఏం చెప్పదలుచుకున్నారనే సందేహాలు సమావేశానికి హాజరైన విలేకరులను పీడించాయి. కొద్ది రోజులుగా డిప్యూటీ సీఎం విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా మూసీ, హైడ్రాపై మాట్లాడలేకపోయారు. ఇప్పుడు స్వదేశానికి వచ్చిన ఆయన.. తాను కూడా ఏదో ఒకటి మాట్లాడాలనే ఉద్దేశంతో విలేకరుల సమావేశం నిర్వహించినట్టుగా ఉంది తప్ప, ఎలాంటి కొత్త విషయం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు విలేకరులు సంధించిన ప్రశ్నలకు ఆయన సమాధానం దాటవేశారు.

ప్రశ్న: మీరు చూపించిన లండన్‌లోని థేమ్స్, జపాన్‌లోని యోడా, సుమిధ నదులకు అనుకునే పెద్ద పెద్ద బిల్డింగ్‌లు ఉన్నాయి. మరి అక్కడ ఇండ్లను కూల్చనప్పుడు ఇక్కడ మూసీ నది కోసం ఎందుకు ఇండ్లను కూల్చుతున్నారు.

మంత్రి: కాలక్రమంలో అలా జరుగుతుంటాయి.

హైడ్రా కూల్చివేతలు ఆగుతాయా? కొనసాగుతాయా?

ఏం చేస్తే బాగుంటుందో మీరే చెప్పండి.

మీరు చూపించిన శాటిలైట్ మ్యాప్‌ల ప్రకారం కబ్జా అయిన చెరువుల్లోని మొత్తం నిర్మాణాలను కూల్చివేస్తారా..?

ఏం చేయాలో మీరే చెప్పండి.

మీరు ప్రదర్శించిన చెరువుల మ్యాప్‌ను అధికారికంగా పరిగణించవచ్చా?

సమాధానం కరువు

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఇండ్లను కూల్చివేస్తామని హైడ్రా చెప్తున్నది. మీరేమో బఫర్ జోన్ జోలికి వెళ్లడం లేదంటున్నారు. ఏది నిజం.

సమాధానం దాటవేత

పెద్ద పెద్ద వాళ్లు బఫర్ జోన్‌లో ఇండ్లు నిర్మించుకున్నట్టు ఆరోపణలున్న గండిపేట, హిమాయత్‌సాగర్, సకాలం చెరువుల్లోనూ ఆక్రమణలు గుర్తించారా?

అన్ని చెరువుల్లోని ఆక్రమణలను గుర్తించాం.

మీరేమో అసలు అంచనాలే సిద్ధం చేయనప్పుడు మూసీ ప్రాజెక్టుకు రూ.1.5 లక్షల కోట్ల బడ్జెట్ అని ఎవరు చెప్పారని అంటున్నారు. కానీ, స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.1.5 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ చేపడుతున్నట్టు తెలిపారు. ఇందులో ఎవరి మాట నిజం?

ఏదో ఓరల్‌గా చెప్పినవి కుదరవు. ఆధారాలు లేకుండా మాట్లాడొద్దు. ఇంకా మేం అంచనాలనే సిద్ధం చేయలేదు.

మూసీ సుందరీకరణకు టెండర్లు ఖరారు కాలేదని మీరంటున్నారు. కానీ ఎంఏయూడీ కార్యదర్శి టెండర్లు పూర్తయ్యాయని, రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని చెప్తున్నారు.

అధికారులు చెప్పింది వేరే అంశం గురించి కావొచ్చు. మూసీ సుందరీకరణను ఎలా చేయాలనే దానిపైనే ఇంకా టెండర్ వేయలేదు. అప్పుడే పనులు ఎలా ప్రారంభిస్తారు.

సీఎందీ ఓ మాట.. డిప్యూటీ సీఎందీ మరో మాట

హైడ్రా, మూసీపై తలోమాట
ఇద్దరి మధ్య సమన్వయం కరువు?

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మూసీ, హైడ్రాపై సీఎం రేవంత్‌రెడ్డిది ఒక మాటైతే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరో మాట మాట్లాడుతున్నారు. ఒకే అంశంపై వీరిద్దరు తలో మాట మాట్లాడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరి మధ్య సమన్వయం కరువైందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం హైడ్రా, మూసీపై మీడియా సమావేశం నిర్వహించిన భట్టి విక్రమార్క పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు భిన్నంగా చెప్పడం గమనార్హం.

రేవంత్‌రెడ్డి: జూలై 20న గోపన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'రూ. 1.5 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణను చేపట్టనున్నాం. లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగా మూసీని ప్రక్షాళన చేస్తాం' అని తెలిపారు.

భట్టి విక్రమార్క: మూసీ సుందరీకరణకు అసలు డీపీఆర్ సిద్ధం కాకుండా, అంచనాలు వేయకుండా రూ.1.5 లక్షల కోట్ల బడ్జెట్ అంటూ ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి. అసలు మూసీ సుందరీకరణ బడ్జెట్ రూ.1.5 లక్షల కోట్లు అని ఎవరు చెప్పారు?

రేవంత్‌రెడ్డి: హైడ్రా కూల్చివేతలు కొనసాగుతాయి.

భట్టి విక్రమార్క: బఫర్ జోన్‌లోని ఇండ్ల జోలికి మేం వెళ్లడం లేదు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న వాటిపై మాత్రమే దృష్టిపెట్టినం.

రేవంత్‌రెడ్డి: మూసీ నిర్వాసితులను అక్కడి నుంచి తరలించి వేరే చోట డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తాం.

భట్టి విక్రమార్క: మూసీ నిర్వాసితులకు అక్కడే సొంతంగా ఇండ్లు కట్టించే ఆలోచన చేస్తున్నాం.

రేవంత్‌రెడ్డి: మూసీ నిర్వాసితులపై ఇప్పటికే సర్వే చేశాం. వారిని తరలిస్తున్నాం.

భట్టి విక్రమార్క: మూసీ నిర్వాసితులకు సంబంధించి ఇంకా సర్వే చేస్తున్నాం. ఇప్పుడే ఎవర్నీ తరలించడం లేదు.

కాంగ్రెస్ పాలనలోనూ చెరువుల ఆక్రమణలు

- 2014కు ముందు కూడా ఆక్రమణలు
- ప్రస్తుతానికి ఎఫ్‌టీఎల్ పైనే దృష్టి
- 'మూసీ' బడ్జెట్ 1.5 లక్షల కోట్లు కాదు
- ఇప్పటి వరకు టెండర్లే పిలవలేదు
- డిప్యూటీ సీఎం భట్టి స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ): 2014కు ముందు కూడా హైదరాబాద్‌లో చెరువులు ఆక్రమణకు గురయ్యాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత కాంగ్రెస్ పాలనలో చెరువులు ఆక్రమణకు గురైనట్టుగా ఆయన పరోక్షంగా అంగీకరించారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైడ్రా, మూసీ వివాదంపై స్పందించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ట్రాక్ సెంటర్‌తో కలిసి నగరంలో చెరువులు ఏ విధంగా కబ్జా అయ్యాయో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్‌లో 920 చెరువులు ఉండగా రాష్ట్ర ఏర్పాటు తర్వాత 225 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని, 196 చెరువులు కొంత వరకు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. మిగిలిన 499 చెరువులు సురక్షితంగా ఉన్నట్టు చెప్పారు. 2014కు ముందు రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. అందుకే కొట్లాడి తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో చెరువులన్నీ కబ్జా అవుతున్నాయని, వీటిని కాపాడుకోకుంటే అందరికీ నష్టమని వివరించారు. ప్రస్తుతానికి తమ ప్రభుత్వం కేవలం చెరువుల ఎఫ్‌టీఎల్‌పైనే దృష్టి పెట్టిందని, ఇంకా బఫర్ జోన్ జోలికి పోవడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ బఫర్ జోన్ జోలికి వెళితే ఇంకా ఎక్కువ కూల్చివేతలు ఉంటాయనే సంకేతాలు ఇచ్చారు. మూసీ సుందరీకరణకు రూ. 1.5 లక్షల కోట్ల బడ్జెట్ అంటూ ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, అంత బడ్జెట్ అని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు మూసీ సుందరీకరణకు టెండర్లే పిలవలేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మూసీ బాధితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం చేయబోమని, వారికి అక్కడే ఇండ్లు కట్టించే ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. తమది ప్రజల ప్రభుత్వమని, కూల్చివేతలు ఎవరికీ ఇష్టం ఉండవని అన్నారు. మూసీ ప్రాజెక్టు సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఎజెండా కాదని భట్టి స్పష్టం చేశారు.

కూల్చివేతలు తక్షణం ఆపాలి

సీఎంకు దాసోజు శ్రవణ్ లేఖ



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న సుందరీకరణ ప్రాజెక్టును తక్షణమే నిలిపివేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహ మంత్రులందరికీ సోమవారం ఆయన లేఖ రాశారు. సరైన పరిహారం, కనీస సంప్రదింపులు లేకుండా బలవంతంగా ఖాళీ చేయించడంలో కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని విమర్శించారు. కూల్చివేతలు సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వానికి పరాకాష్ఠగా అని అభివర్ణించారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్‌ను అనుసరించి బుల్డోజర్‌రాజ్‌ను తెలంగాణలోకి తెచ్చిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు. కూల్చివేతలను ఆపాలని, జీవో 477ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మూసీ పరీవాహక ఎమ్మెల్యేలతో దక్షిణ కొరియాకు మంత్రులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబరు 7 (నమస్తే తెలంగాణ) : మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లతో కూడిన నగర ఎమ్మెల్యేలు, జీహెచ్‌ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్, అధికారుల బృందం దక్షిణ కొరియాకు వెళ్లనున్నది. మూసీ పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, ఇతర అధికారులతో మంత్రులు దక్షిణ కొరియాలోని చియోంగేచియోన్ స్ట్రీమ్ పునరుద్ధరణ ప్రాజెక్టును సందర్శించనున్నారు. దక్షిణ కొరియాలోని సియోల్ మధ్యలో 5.84 కిలోమీటర్ల మేర చియోంగేచియోన్ స్ట్రీమ్ ప్రాజెక్టును తీర్చిదిద్దారు. మూసీ సుందరీకరణలో భాగంగా ఈ ప్రాజెక్టుపై అధ్యయనం చేసేందుకు 15 మందితో కూడిన బృందం ఈ నెల 21 నుంచి 26 వరకు దక్షిణ కొరియాలో పర్యటించనున్నది.